సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 7 । నవంబర్ । 2022



రమణీయం

ఏజెన్సీలో పచ్చని పంటపొలాలు ల్యాండ్ స్కేపింగ్‌ను తలపిస్తున్నాయి. వాలుకద్దంగా గట్లు నిర్మించి సాగు చేపట్టడం వల్ల మెట్లు మాదిరిగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. దముకు, త్రైడ, కరకవలస, అరకు- విశాఖ ప్రధాన రహదారిలో ఈదృశ్యాలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

8లో

దబ్బగూడెం జంక్షన్ వద్ద ఆదివారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు.

న్యూస్‌రీల్

వృద్ధుడికి పింఛను పునరుద్ధరణ

- వినతిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఆయన ఆదేశాల మేరకు సాంకేతిక సమస్యను సరిదిద్దిన డీఎల్పీవో
- యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కారం
- ఆదివారం అయినా నగదు పంపిణీ



వృద్ధుడు బేషుకు పింఛన్ సొమ్మును ఇస్తున్న కార్యదర్శి రవీంద్ర

కొయ్యూరు: పింఛను పునరుద్ధరణకు వృద్ధుడు ఇచ్చిన వినతిపత్రంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ తక్షణం స్పందించారు. సత్వరం సమస్య పరిష్కరించడంతో ఆ వృద్ధుడిలో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ వెంటనే పింఛను సొమ్ము అందేలా చర్యలు తీసుకున్నారు. వివరాలిలావున్నాయి. మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబందకు చెందిన పాంగి బేసుకు 11 నెలలుగా పింఛను అందడం లేదు. దీని కోసం ఆయన రెండు మూడు సార్లు అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే సమస్య పరిష్కరించాలని డీఎల్పీవో కుమార్‌ను ఆదేశించారు. దీంతో పింఛన్ ఆగిపోవడానికి కారణాలపై ఆయన పరిశీలించారు. బేసు ఆధార్‌కార్డు మరొక పింఛన్‌దారుడితోమ్యాప్ అయినట్టుగా తేలింది. దీనిని సరిచేసిన ఆయన వెంటనే పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మూలపేట కార్యదర్శి రవీంద్ర సిబ్బందితో కలిసి ఆదివారం జాజులబంద వెళ్లారు. పింఛను సొమ్ము రూ.2560 అందజేశారు. పింఛన్ రావడంతో బేసు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా డీఎల్పీవో కుమార్ మాట్లాడుతూ డౌనూరు పంచాయతీకి చెందిన బి.అనిత వితంతు పింఛను కూడా పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు




పాంగి లక్ష్మణ్

చింతపల్లి రూరల్: ఒకే మార్గంలో వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కేజీహెచ్‌కు తరలించారు. గూడెం కొత్తవీధి మండలం ముల్లుమెట్ట-వంచుల రహదారిలో సిరిబాల గ్రామానికి చెందిన రామ్ ప్రసాద్, సంతోష్ ద్విచక్ర వాహనంపై చింతపల్లి వస్తున్నారు. దీని వెనుక వస్తున్న కడుగుల గ్రామానికి చెందిన పాంగి లక్ష్మణ్ వాహనం ముందు వాహనం ఢీకొన్నాయి. ముల్లుమెట్ట గ్రామ సమీప మలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన ముగ్గురిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాంగి లక్ష్మణ్‌కు బలమైన గాయం తగలడంతో ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. రామ్ ప్రసాద్, సంతోష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



డుడుమ జలపాతం వద్ద ప్రమాదకర ప్రదేశం



ప్రాణాలు మింగేస్తున్న గాదేగుమ్మి జలపాతం

జలపాతాలతో జాగ్రత్త సుమా..!

కార్తీక మాసం ప్రారంభం నుంచి దాదాపు మార్చి వరకు పర్యాటకుల సందడి ఉంటుంది. ప్రకృతి అందాలను తిలకించాలనుకునే వారికి ఈ శీతాకాలంలో మన్యం రా రమ్మని ఆహ్వానం పలుకుతుంది. మంచు సోయగాలకు తోడు జలపాతాల విన్యాసాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. ఈ ఆనందంలో కొత్త ప్రదేశాలను చూసి తన్మయత్వానికి లోనై పర్యాటకులు ప్రమాదాలబారిన పడుతుంటారు. ముఖ్యంగా జలపాతాల వద్ద అజాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. విశాఖ మన్యంలో విహార యాత్రలకు వచ్చే వారిలో ఎక్కువ మంది అకాలమృత్యువు కాటేయడానికి కారణమిదే. జలపాతాల వద్దే ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- స్నానాలు చేస్తుండగా ప్రమాదాలు
- హెచ్చరికలను పట్టించుకోని సందర్శకులు
- అజాగ్రత్తే కారణమంటున్న పోలీసులు

ముంచంగిపుట్టు/కొయ్యూరు: మన్యంలో ప్రకృతి సోయగాలు తిలకించేందుకు, జలపాతాల సవ్వడులు తనివితీరా ఆస్వాదించేందుకు దేశ, విదేశాల నుంచి సందర్శకులు వస్తుంటారు. వనభోజనాలతో ప్రారంభమయ్యే విహారయాత్రలు కొత్త సంవత్సరం వరకు కొనసాగుతాయి. ముఖ్యంగా జలపాతాలు వద్దకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

- ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న డుడుమ జలపాతం 556 అడుగుల పైనుంచి జాలువారుతుంది. ఈ ప్రాంతానికి వెళ్లడమంటే కాస్త ప్రమాదంతో కూడుకున్నదే. ఇక్కడికి వెళ్లాలంటే 800 మెట్లు దిగాలి. జలపాతం దిగువ భాగంగాలో నీటి ప్రవాహంతో రాళ్లు కోతకు గురై సొరంగాలు ఏర్పడ్డాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే.
- మండలంలో జడిగూడ, బురదగుంట, హంసబంద జలపాతాలు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.
- అనంతగిరి మండలంలో సరియా, కటికి, తాటిగూడ, డుంబ్రిగుడ, జి.మాడుగుల, చింతపల్లి, పెదబయలు, అరకు మండలాల్లో చాపరాయి,రణజిల్లెడ, కొత్తపల్లి, పిట్టలబొర్ర, తారబు. రావిమానుపాకలు వద్ద ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.
- బండరాళ్లపై నిరంతరం నీళ్ల ప్రవహిస్తూ ఉండటం వల్ల అవి నాచు పట్టి జారుడుతత్వం కలిగి ఉంటాయి. స్నానాలు చేస్తుండగా జారి జలపాతంలో పడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.
- కొయ్యూరు మండలంలోని గాదేగుమ్మి జలపాతం, పరిసరాలు చూసేందుకు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఇక్కడే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు కోల్పోవాల్సిందే. ఇప్పటివరకు సుమారు 40 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహం పైకి తేలేందుకు రెండు మూడు రోజులు పడుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- గాదేగుమ్మి జలపాతానికి ఇరువైపులా ఇనుప గ్రిల్స్ ఏర్పాటుచేయాలన్న ఆలోచనలో సీఐ స్వామినాయుడు యోచిస్తున్నారు. ఇవి ఏర్పాటు ద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయన భావిస్తున్నారు. కార్తీకమాసం కావడంతో పర్యవేక్షణకు ఇక్కడ హెడ్ కానిస్టేబుల్‌ను నియమించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

డుడుమ జలపాతం వద్ద ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఒడిశా అధికారులతో మాట్లాడాం. ఒడిశా అధికారులు జలపాతం వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయించాం. చాలా మంది జలపాతం వద్ద గల్లంతై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.పర్యాటకులు జాగ్రత్తలు పాటిస్తూ ఎటువంటి రిస్క్ చేయకుండా సందర్శించాలి.

– నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు

ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటుకు కృషి



గాదేగుమ్మి జలపాతంలో పడి ఇప్పటివరకు చాలామంది మృతి చెందారు. వీటిని అరికట్టేందుకు ఇరువైపులా గ్రిల్స్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. ఇందుకు వ్యాపారులు సహకరిస్తున్నారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. కార్తీక మాసం ముగిసే వరకు గస్తీ కొనసాగిస్తాం.

– స్వామినాయుడు, సీఐ, కొయ్యూరు

సంకల్పంతో సంక్షేమం..



పాడేరులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



అరకులో కేక్ కట్ చేసి విజయోత్సవం నిర్వహిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విజయోత్సవాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం సంబరాలు జరుపుకున్నాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు విజయోత్సవం నిర్వహించారు.



అడ్డతీగలలో కేక్ కట్‌చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు

దేవస్థానం భూములు కేటాయించాలి

- ఆదివాసీల డిమాండ్
- రామాలయం వరకు ర్యాలీ

ఎటపాక: పురుషోత్తపట్నం పరిధిలోని భద్రాద్రి దేవస్థానం భూములు ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. ఆదివారం దమ్మక్కగూడెం సెయింట్ ఆన్స్ స్కూల్ నుంచి భద్రాచలంలోని దేవస్థానం ఈవో కార్యాలయం వరకు ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. బారీ ర్యాలీ నిర్వహించారు. దేవస్థానం ఏఈవో భవానీ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా వలస గిరిజనేతరులు, కొందరు దేవస్థానం అవినీతి అధికారుల అండదండలతో భూములు ఆక్రమించి అనుభవిస్తున్నారని ఆరోపించారు.వందల ఎకరాలు విక్రయాలు కూడా చేసి దేవస్థానం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దేవస్థానం భూములు పోలవరం నిర్వాసితులకు, పునరావాసానికి, సాగుకు కేటాయించాలని కోరారు. అంతేకాకుండా ,ఆదివాసీ హక్కులకు అనుకూలంగా దేవస్థానానికి ఆదాయం సమకూర్చే విధంగా నిర్ణయం తీసుకుని రామయ్య భూములకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఏయస్పీ అధ్యక్షుడు ఉయిక శంకర్, రెండు రాష్ట్రాల నేతలు మోకాల సుధీర్, కుంజా అనిల్, సంజీవరావు, దుర్గారెడ్డి, మడివి నెహ్రూ, కూర నాగేశ్వరావు, బంగారు వెంకటేశ్వర్లు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



దేవస్థానం ఏఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నేతలు

విద్యాశాఖకు లోకాయుక్త నోటీసులు

- విద్యాకమిటీ తీర్మానం అమలులో జాప్యంపై జారీ

కొయ్యూరు: విద్యాకమిటీ తీర్మానాన్ని అమలు చేయడంలో జాప్యం చేస్తున్నందుకుగాను విద్యాశాఖాధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. అడాకుల పంచాయతీ కిష్టారం పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ రాజకుమారి ఆధ్వర్యంలో గత మార్చిలో మధ్యాహ్నం భోజనం తయారు చేస్తున్న వారిని మార్చాలని తీర్మానం చేసింది. ఈ కాపీలను ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్, డీఈవోకు పంపించారు. అయినా మార్పు చేయకపోవడంతో కొత్త జిల్లా ఏర్పడిన తరువాత కూడా ఇక్కడి కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఈవో రమేష్‌లకు వినతులు పంపించింది. దీనిపై స్పందించిన వారు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని వారు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మండల స్థాయిలో చర్యలు తీసుకోలేదు. దీనిపై విద్యాకమిటీ మళ్లీ లోకాయుక్తను ఆశ్రయించింది. పూర్తి వివరాలను పరిశీలించిన లోకాయుక్త విద్యాశాఖాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారంతో ఈనెల 12న హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చినట్టుగా విద్యా కమిటీ చైర్‌పర్సన్ రాజకుమారి తెలిపారు. కలెక్టర్, డీఈవో ఆదేశించినా పట్టించుకోనందున లోకాయుక్తను ఆశ్రయించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

డీఈవోకు నివేదించాం

మధ్యాహ్న భోజనం తయారీదారులను మార్పు చేయడానికి సంబంధించి పూర్తి వివరాలతో డీఈవోకు నివేదించామని ఎంఈవో బోడంనాయుడు తెలిపారు. అక్కడ పనిచేస్తున్న వారిలో వయసు అధికంగా ఉన్న మహిళ ఉన్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను డీఈవోకు తెలియజేశామని చెప్పారు. మరోసారి పాఠశాలను సందర్శించి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వయసు అధికంగా ఉన్న వారిని తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

విహారయాత్రలో విషాదం

- గోస్తనీ నదిలో మునిగి యువకుడి మృతి



ఉదయ్‌కుమార్ మృతదేహం

అనంతగిరి: విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని కాశీపట్నం గోస్తనీ నదిలో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. కార్తీకమాసం కావడంతో మన్యంలోని అందాలతో పాటుగా కాశీపట్నం ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం దర్శనానికి పాతగోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఉదయ్‌కుమార్ (19) కుటుంబ సభ్యులతో ఆదివారం వచ్చాడు. ఆలయ దర్శనం అనంతరం ఇక్కడికి సమీపంలో గోస్తనీ నదిలోకి స్నానానికి దిగాడు. ప్రమాదశాత్తూ నీటమునిగి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో చైతన్యంతోనే సమాజ మార్పు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ శ్రీదేవి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

అరకులోయ రూరల్: విద్యార్థుల్లో చైతన్యంతోనే సమాజ మార్పు సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. శ్రీదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విశాఖపట్నం జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ అధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మద్యపాన నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ఉన్నత లక్ష్యంతో చదువుకోవడం వల్ల మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవచ్చునన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల థింసా నృత్యాన్ని తిలకించారు. విద్యార్థులు చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న పోలీసు శాఖను అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పోలీసులు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల స్టాళ్లను తిలకించారు. పోలీసులు తుపాకులను ప్రదర్శించారు. స్థానిక ప్రథమశ్రేణి జ్యూడీషియల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఉమాదేవి, ఎస్పీ సతీష్‌కుమార్, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు, సీఐ దేముడుబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మన్యంలోని ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అయ్యారు. వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు. పాలకడలిని తలపించేలా మంచు అందాలకు మంత్రముగ్ధులయ్యారు. కుటుంబసమేతంగా ఆస్వాదించి రోజంతా ఉత్సాహంగా గడిపారు.

పరవశించిన పర్యాటకులు




వలిసె అందాల్లో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం సాయంత్రమే ఇక్కడికి చేరుకున్నారు. మంచుతో పాటు వలిసె పూల అందాలను తిలకించారు. జిల్లావ్యాప్తంగా సందర్శనీయ ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. చెరువులవేనం, వంజంగి హిల్స్, మాడగడ ప్రాంతాల్లో పాలకడలిని తలపించే మంచు అందాలను తిలకించారు. సీతమ్మకొండ ప్రాంతంలోని ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. అరకు పద్మాపురం గార్డెన్,గిరిజన మ్యూజియంలో పర్యాటకుల సందడి నెలకొంది.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. ప్రవాహంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. అరకు-పాడేరు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వలిసె పంటలో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. వలిసె అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. విద్యా సంస్థలకు సెలవు కావడంతో ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సమేతంగా విచ్చేశారు. జలప్రవాహంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కబాబులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎకో టూరిజం సిబ్బంది పర్యవేక్షించారు.



బొర్రాగుహలను సందర్శించిన పర్యాటకులు

చీకుధార జలపాతం వద్ద..

రాజవొమ్మంగి: మండలంలోని కిమ్మిలిగెడ్డ అటవీ ప్రాంతంలోని చీకుధార జలపాతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదివారం సందడి చేశారు. ఆదివారం కావడంతో సుదూరప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడ జలకాలాడుతు రోజంతా సేదతీరారు. అక్కడే భోజనాలు చేసి సాయంకాలం తిరుగుపయనమయ్యారు. కార్తీకమాసం కావడంతో ఇక్కడి శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

మారేడుమిల్లిలో..

మారేడుమిల్లి :మండలంలోని పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో సందడిగా మారాయి. కార్తీక మాసం కావడం కావడంతో ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జలతరంగిణి, అమృతధార, జంగిల్ స్టార్, పాములేరు, వ్యూపాయింట్స్, వాలిసుగ్రీవ్ వనమూలికల ప్రదేశం , కాఫీతోటలు తదితర ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. జలపాతాల్లో స్నానాలు చేస్తూ సందడి చేశారు. విద్యార్థులు గార్డెన్ పార్టీలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు.

బొర్రాకు రూ.4 లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. కార్తీకమాసం రెండోవారం కావడంతో పాటుగా ఆదివారం కావడంతో మన్యం అందాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం ఐదు వేల మంది తిలకించగా, సుమారు రూ.4 లక్షల మేర ఆదాయం వచ్చిందని మేనేజర్ గోరీశంకర్ తెలిపారు. మండలంలోని దముకు వ్యూపాయింట్, కాఫీ ప్లాంటేషన్, కటికి, తాటిగుడ, సరియా తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.




చాపరాయిలో పర్యాటకుల సందడి



వంజంగి హిల్స్‌లో మంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



చీకుధార వద్ద పర్యాటకుల సందడి



జలతరంగిణి జలపాతం వద్ద పర్యాటకులు

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

- మరో ఇద్దరు పరారీ

మోతుగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో దబ్బగూడెం జంక్షన్ వద్ద ఆదివారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. మరో ముగ్గురు పరారయ్యారు. ఎస్ఐ వి.సత్తిబాబు కథనం మేరకు వివరాలిలావున్నాయి. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సుకుమామిడి నుంచి ఉత్తరప్రదేశ్‌కు కారులో గంజాయి తరలిస్తున్న యువకుల నుంచి పది ప్లాస్టిక్ బ్యాగుల్లో 300 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఢిల్లీకి చెందిన రవిచౌహాన్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జూబర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు, ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి పరారయ్యారని ఆయన వివరించారు. వారికోసం గాలిస్తున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.9 లక్షలు ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, సురన్నబాబు, హెచ్‌సీ సత్తిబాబు, సోమరాజు, రవిచంద్ర, పీసీలు శివ ప్రసాద్, సన్యాసిరావు పాల్గొన్నారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్, ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వివరించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: రైలు నుంచి జారి పడి నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ పట్టాలపై ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాల ప్రకారం తుని సీతారాంపురానికి చెందిన రౌతుల సుబ్బారావు(39)గా గుర్తించినట్టు చెప్పారు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు సుబ్బారావు అనకాపల్లి నుంచి తుని తిరిగి వస్తుండగా ట్రైన్ నుంచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

పాయకరావుపేట: కిడ్నాప్ కేసును స్థానిక పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. సీఐ అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు తునిలోని ఓ లాడ్జిలో ఉంటున్నారు. ఆ ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్‌కు గురయ్యారని, పాయకరావుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ పనికి పాల్పడినట్టు తుని పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పాయకరావుపేట పోలీసులు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ముగ్గురు వ్యక్తులతో పాటు కిడ్నాప్ చేసి తీసుకుపోతున్న ముగ్గురిని పాయకరావుపేటలోని తాండవా చక్కెర కర్మాగారం వద్ద పట్టుకుని, తుని పోలీసులకు అప్పగించారు. దీనిపై తుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

ముంగిటకే సాహస పర్యాటకం

- ఫ్రెండ్లీ పాలసీతో ప్రాజెక్టులకు ఆహ్వానం
- నియమ నిబంధనల్లో పూర్తిగా మార్పులు చేసిన పర్యాటక శాఖ
- వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు ప్రాధాన్యం
- 8 బీచ్‌లు, రెండు నదులు, రెండు రిజర్వాయర్లలో ఏర్పాటుకు ప్రణాళికలు
- తక్కువ పెట్టుబడులతో టూరిస్టులను ఆకర్షించేలా ప్రాజెక్టుల రూపకల్పన



సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి అందాలతో అలరారే విశాఖలో పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు సరికొత్త ఆలోచనలతో టూరిజం శాఖ ముందుకెళ్తోంది. సాగర సోయగాల్లో విహరిస్తూ.. విభిన్న అనుభూతులతో కూడిన ఆనందాన్ని టూరిస్టులకు అందించేలా వినూత్న ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇన్నాళ్లూ ప్రధాన అవరోధాలుగా ఉన్న నియమ నిబంధనల్లో మార్పులు తీసుకొస్తూ.. పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఫ్రెండ్లీ పాలసీ తీసుకొచ్చింది. ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ.. 8 బీచ్‌లతో పాటు కొండకర్ల ఆవ, ముడసర్లోవను పర్యాటకుల స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా.. విశాఖ ఉమ్మడి జిల్లాను పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా టూరిజం శాఖ కసరత్తు చేస్తోంది. ఇన్నాళ్లూ.. పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాన అవరోధాలుగా నియమ నిబంధనలుండేవి. ఎక్కువ మొత్తం ఫీజులు, బిడ్ ఫీజ్.. ఇలా కఠినమైన నిబంధనల కారణంగా ప్రాజెక్టులు పెట్టేందుకు ఎవరూ అంతగా ఆసక్తి చూపించేవారు కాదు. ఇప్పుడు వాటన్నింటినీ పూర్తిగా సరళతరం చేస్తూ.. అందరినీ ఆకట్టుకునేలా రూపొందించారు. ఉదాహరణకు వాటర్ స్పోర్ట్స్‌లో బిడ్ వేయాలంటే ఐదేళ్ల అనుభవం ఉండాలి. దీన్ని ఏడాదికి మార్చారు. ఒకవేళ ఆసక్తి ఉండి..అనుభవం లేని ఎవరైనా కన్సోటియం తీసుకుంటే చాలు.. ప్రాజెక్టును అప్పగించేందుకు పర్యాటక శాఖ మార్గం సుగమం చేసింది. అలాగే టూరిజం ప్రాజెక్టులకు బిడ్ ఫీజ్ రూ.లక్ష ఉండేది. ఇప్పుడు దాన్ని కేవలం రూ.10 వేలకు కుదించారు. దీంతో పాటు టెండర్లలో కనీస ఆదాయం వాటా వాటర్ స్పోర్ట్స్‌కు 15 శాతం, అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు 25 శాతం, ట్రెక్కింగ్‌కు 10 శాతంగా నిర్ణయించారు. ఇందులో ఎవరు ఎక్కువగా టెండర్లలో కోట్ చేస్తే.. వారికి అవకాశం కల్పించేలా అన్ని నిబంధనలను సరళతరం చేశారు. ఈ చర్యల వల్ల టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు చాలా మంది ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది.

ఎనిమిది సాగరతీరాలతో పాటుగా..

ఉమ్మడి విశాఖ జిల్లాలోని అపార అవకాశాలను మెరుగు పరుచుకుని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. ఇందుకోసం టూరిజం శాఖ విభిన్న కార్యక్రమాలను ప్రారంభించేందుకు కొన్ని ప్రాంతాలను గుర్తించింది. ఉమ్మడి విశాఖ పరిధిలోని 8 బీచ్‌లతో పాటు రెండు ప్రాంతాల్లో కొత్త టూరిస్ట్ ప్రాజెక్టులు నెలకొల్పాలని నిర్ణయించింది. సాగర్‌నగర్, పూడిమడక, జోడుగుళ్లపాలెం, భీమిలి, ఎండాడ, యారాడ, మంగమారిపేట, రేవు పోలవరం బీచ్‌ల్లో జెట్‌స్కై, స్పీడ్ బోట్, కయాకింగ్, ట్రాంపోలిన్, స్టాండప్ పెడల్, స్కూబా డైవింగ్, నెట్ క్రికెట్ వంటి వాటర్ స్పోర్ట్స్ మొదలైనవి ఏర్పాటు చేయనుంది. వీటికి కనీస పెట్టుబడిగా రూ.60 లక్షలను నిర్ణయించింది. ముడసర్లోవ రిజర్వాయర్, కొండకర్ల ఆవ, గోస్తనీ, శారదా నదుల్లో వాటర్‌స్పోర్ట్స్‌తో పాటు పెడల్ బోట్స్, స్టాండప్ బోట్స్, వాటర్ సైకిల్ మొదలైనవి ఏర్పాటు చేయనుంది. వీటికి కనీస పెట్టుబడిగా రూ.20 లక్షలను నిర్ణయించింది.

14న ప్రీ బిడ్డింగ్ మీట్ ఏర్పాటు



సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. టూరిజం ఎండీ కన్నబాబు సూచనల మేరకు విశాఖలో ఈ నెల 14న ప్రీ బిడ్డింగ్ మీట్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. దేశ విదేశీ సందర్శకులను కునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలతో ముందుకు వెళ్తున్నాం. ఈ మీట్‌లో ఎవరికి ఏమైనా అదనపు వెసులుబాటు కావాలన్నా తమ దృష్టికి తీసుకురావచ్చు. మరింత సమాచారం కోసం టూరిజం రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చు. ప్రతి బిడ్‌ను పారదర్శకంగా నిర్వహించనున్నాం. ప్రస్తుతం గుర్తించిన స్థలాలతో పాటు.. ఎవరైనా పెట్టుబడిదారులు వారు చేపట్టబోయే ప్రాజెక్టుల కోసం ఇతర ప్రాంతాలను తమ దృష్టికి తీసుకొచ్చినా వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటాం.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

కేబుల్ ఆపరేటర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం

- కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పనలపూడి సీతారామయ్య

తుమ్మపాల: ఏపీ ఫైబర్‌నెట్‌ను మరింత అభివృద్ధి చేసి, విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పనలపూడి సీతారామయ్య కోరారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర్‌రావు కల్యాణమండపంలో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ద్వితీయ వార్షికోత్సవ సమావేశం జరిగింది.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆపరేటర్లు ఎదురొంటున్న సమస్యలపై జేఏసీ అలుపెరగని పోరాటం చేస్తోందని, జేఏసీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించగలిగామని చెప్పారు. లక్ష కుటుంబాలకు ఉపాధికల్పిస్తున్న కేబుల్ టీవీ రంగాన్ని కార్పొరేట్ సంస్థల నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కేబుల్ టీవీ రంగాన్ని పరిశ్రమంగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్.ప్రకాష్, రాష్ట్ర జేఏసీ వైస్‌చైర్మన్ మిరియాల శ్రీరామ్, ఎ.నారాయణరావు, బుల్లెట్ బాబు, ఉత్తరాంధ్ర కేబుల్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధీ కూరగాయల మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

అనకాపల్లి టౌన్: స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్లో శనివారం రాత్రి సుమారు రెండు గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. మార్కెట్‌కు సమీపంలో ఉన్న వారు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక అధికారి బి.నరసింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేశారు. అప్పటికే రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. తమను ఆదుకోవాలని బాధితులు కొణతాల శివ సన్యాసి అప్పారావు, బి.విజయకుమార్ కోరారు. ఈ ప్రమాదంలో రూ.9 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అగ్నిమాపక అధికారి అంచనా. వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆదివారం మార్కెట్‌ను సందర్శించారు. వ్యాపారులు కొణతాల శివసన్యాసి అప్పారావు, బి.విజయకుమార్‌లను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఉజ్వల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అడ్డతీగలలో గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు



రైతులకు పవర్ వీడర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- 109 గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ

అడ్డతీగల: ఉజ్వల యోజన పథకం మహిళలకు ఎంతగానో ఆదుకుంటుందని, సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల జీసీసీ బ్రాంచి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గంగవరం, అడ్డతీగల రాజవొమ్మంగి మండలాలకు చెందిన 109 మహిళా లబ్ధిదారులకు ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన పేద మహిళలకు ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందజేయనున్నట్టు తెలిపారు. అర్హత ఉన్న మహిళలు జీసీసీ సిబ్బందికి దరఖాస్తు చేసుకుంటే ఆ మేరకు వివరాలు పరిశీలించి కనెక్షన్‌లు మంజూరు చేస్తారన్నారు.

పవర్ వీడర్లు పంపిణీ

సాగు పనుల్లో ఉపయోగపడే పవర్ వీడర్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక వైటీసీ భవనంలో ఉద్యానవనశాఖ అధికారులు ఆదివారం ఏర్పాటుచేసిన పవర్ వీడర్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రైతులకు పవర్ వీడర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో పవర్ వీడర్ రూ.10,300 ధర కాగా వాటిలో 10 శాతం లబ్ధిదారుడైన గిరిజనుడు చెల్లిస్తే సరిపోతుందన్నారు. 32 పవర్ వీడర్లు అడ్డతీగల ,గంగవరం మండలాల రైతులకు తొలివిడతగా అందిస్తున్నామన్నారు.ఉద్యానవనశాఖ ద్వారా అందుబాటులోనికి వస్తున్న పవర్ వీడర్లు పొందడానికి ఉన్న అవకాశాన్ని గిరిజన రైతులు ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యానాధికారి కె.చిట్టిబాబు,ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

పాడేరు రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని పాడేరు ఎస్ఐ లక్ష్మణ్ సూచించారు. పాడేరు–చోడవరం ప్రధాన రహదారి ఘాట్ మార్గంలో ఇటీవల వరుసగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన అమ్మవారి పాదాల జంక్షన్ వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 50 వాహనాలకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించికుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

యలమంచిలి: మండలంలో మర్రిబంద జాతీయ రహదారిపై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యలమంచిలి మండలం మర్రిబంద గ్రామానికి చెందిన యాక చిలకమ్మ (62) రోడ్డు అవతల గల పొలంలోకి వెళ్లడానికి ఆదివారం ఉదయం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాత సత్యవరంలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తినష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పాకలు

పాయకరావుపేట: పాత సత్యవరం గ్రామంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ సిలిండర్లు పేలడంతో అక్కడున్న జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు యువకులు ధైర్యం చేసి పక్కనే గల పాకలో ఉన్న మరో గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసి ప్రమాదం మరింత పెద్దది కాకుండా నివారించారు. వినాయకుడి ఆలయం వద్ద పాకల్లో దుకాణాలు, హోటళ్లు నిర్వహిస్తున్నారు. పాకలపై ఉన్న చెట్లలోని విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పాకలకు అంటుకున్నాయి. వరుసగా పాకలు ఉండడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ పాకల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పెద్ద శబ్దంతో పేలిపోయాయి. వరుసగా తమలపాకుల కంపెనీ, స్ప్రేయర్లు ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న తుని, నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే పాకలు పూర్తిగా కాలిపోవడంతో భారీగా నష్టం సంభవించినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో తంపా రమణ, తంపా వీరబాబులకు చెందిన హోటళ్లు, సఖిలేటి దుర్గారావుకు చెందిన తమలపాకుల కంపెనీ, ఉప్పు చెల్లారావుకు చెందిన స్ప్రేయర్లు, బొండాడ శ్రీనివాసరావుకు చెందిన సెలూన్, మటన్ దుకాణాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారుల అంచనా. సంఘటనా స్థలానికి ఆర్ఐ త్రినాథ్ చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ సఖిలేటి రాము, వీఆర్వో రామస్వామి బాధితుల వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం నుంచి నష్టం పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

- కుటుంబసభ్యులకు అందజేసిన పోలీసులు



కుటుంబ సభ్యులకు విద్యార్థినిని అప్పగిస్తున్న జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: గత నెల అదృశ్యం అయిన గూడెం కొత్తవీధి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆచూకీని గూడెంకొత్తవీధి పోలీసులు కనుగొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ అశోక్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. గూడెంకొత్తవీధి ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న కోడె అచ్యుత పాఠశాల నిర్వాహకులకు చెప్పకుండా గత నెల 14న వెళ్లిపోయిందన్నారు.ఈ విషయంపై పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యార్థిని కుటుంబసభ్యులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. విద్యార్థిని జి.మాడుగులలో ఉన్నట్టు సమాచారం తెలియడంతో అక్కడ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని తమకు అప్పగించినట్టు తెలిపారు. బాలికను ఆమె కుటుంబసభ్యులకు అప్పగించినట్టు చెప్పారు. ఎస్ఐ అప్పలసూరి, సిబ్బంది ఉన్నారు.

జి.మాడుగుల: జీకే వీధి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కోడె అచ్యుత మండలంలోని గాంధీనగరంలో అనుమానస్పదంగా తిరుగుతుండాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని సర్పంచ్ కిముడు రాంబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడ సన్యాసిదొరకు తెలియజేశారు. వారు సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు బాలికను ఎస్ఐ శ్రీనివాస్ సమక్షంలో దేవరాపల్లి ఎంపీటీసీ కృష్ణమూర్తి , చిన్నారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మునగపాక: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాక ఇందిరమ్మ కాలనీకి చెందిన వాడబోయిన బలరాం కృష్ణ, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు భార్గవ్ దుర్గా ప్రసాద్(26) కొంతకాలంగా మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులతో గొడవపడుతూ ఉండేవాడు. కొడుకు వేధింపులు తాళలేక తల్లిదండ్రులతో పాటు చిన్నకుమారుడు 20 రోజుల క్రితం నాగులాపల్లిలో అద్దె ఇంటికి మకాం మార్చారు. భార్గవ్ మాత్రం మునగపాక ఇందిరమ్మ కాలనీలో ఉండేవాడు. భార్గవ్ ఉంటున్న ఇంటి నుంచి ఆదివారం దుర్వాసన రావడంతో పక్కింటి వారు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో భార్గవ్ తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని తలుపులు తీసి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రి తరలించి, మృతుడు భార్గవ్ తండ్రి బలరాం కృష్ణ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భీమరాజు తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు



పద్మశాలి సంఘ అధ్యక్షుడు నర్సింగరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పద్మశాలి సంఘం అరకు నియోజకవర్గ అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, టీడీపీ వార్డు సభ్యుడు రామకృష్ణ, ఆ సంఘం ప్రతినిధులు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపిటీసీ సభ్యులు భీమరాజు, రాంచందర్, మాజీ ఎంపీపీ అరుణకుమారి, మాజీ సర్పంచ్ గులభి, వైఎస్సార్ సీపీ నేతలు రఘునాథ్, అప్పాలు, అర్జున్, శెట్టి ఆనంద్, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సహకారం అందించేందుకు కృషి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి
- ముగిసిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీ, ప్రదర్శన



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



జాతీయస్థాయి ప్రదర్శనలో చిత్రాలను ఆసక్తిగా చూస్తున్న ఎంపీ సత్యవతి

చోడవరం: కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం ప్రేమసమాజం ఆవరణంలో చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీ, ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన ఈ ప్రదర్శనను వేలాది మంది విద్యార్థులు, ప్రజలు తిలకించగా ముగింపు కార్యక్రమంలో పెద్దసంఖ్యలో చిత్రకళాకారులు పాల్గొన్నారు. విజేతలకు ఈ సందర్భంగా నగదు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ ఆశీర్వాదం, శర్మలను ఘనంగా సత్కరించారు. చిత్రకళానిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ కళలు అంతరించిపోతున్న తరుణంలో వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించి వారికి నచ్చిన విభాగంలోనే శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. చోడవరంలో కళాభారతిని ఏర్పాటు చేసి అన్ని కళలను ప్రోత్సహించడంతోపాటు కళాకారులకు తగిన సహకారం అందించేందుకు కృషిచేస్తామన్నారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ చోడవరంలో జాతీయస్థాయి ఆర్ట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక అంశాలు ఒక చిత్రకారుడు మాత్రమే తన కుంచె ద్వారా ప్రజలకు, సమాజానికి తెలియజేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఫారెస్టు ఆఫీసర్ బి.రామన రేష్, ఆర్క్ ప్రసాద్, దేముడు మాస్టారు, ప్రముఖ చిత్రకారుడు రామారావు, వి.ఎ.ఆర్. సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, టి.వి. రమణ, ప్రేమసమాజం మేనేజర్ రాజు పాల్గొన్నారు.